క్లుప్తంగా

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఉదయగిరి: వాతావరణ మార్పు నేపథ్యంలో వైరల్ జ్వరాలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గండిపాళెం వైద్యాధికారిణి ఎం.శివకల్పన తెలిపారు. ఉదయగిరి పట్టణంలోని సినిమా హాలు వీధి, శ్రీనగర్ కాలనీ, సింగనపల్లి వీధి తదితర ప్రాంతాల్లో ఆరోగ్య వైద్య సిబ్బంది శుక్రవారం నిర్వహిస్తున్న జ్వరాల సర్వే, లార్వా సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో ఆరోగ్య బోధకులు కలసపాటి వెంకటసుబ్బయ్య, ఆరోగ్య సహాయకులు శ్రీనివాసులు, ఏఎన్ఎం స్వాతి, ఆశా కార్యకర్తలు శ్రీదేవి, సలోమి పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ



మర్రిపాడు: మండలంలోని కంపసముద్రం గ్రామంలో ఇఫ్కో ఆధ్వర్యంలో జొన్న పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.శివన్నారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కె.కిరణ్‌కుమార్‌రెడ్డి, మర్రిపాడు వ్యవసాయాధికారి ఎస్.రామ్మోహన్, ఇఫ్కో అధికారి వి.లక్ష్మీనారాయణ, వీఏఏ పాల్గొన్నారు.

గృహ నిర్మాణ శాఖ ఏఈ సమీక్ష

మర్రిపాడు: మండల హౌసింగ్ ఏఈగా బాధ్యతలు స్వీకరించిన ఎం.రవికుమార్ శుక్రవారం మర్రిపాడు మండల సమావేశ మందిరంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఓ వెంకట నారాయణ పాల్గొన్నారు.

నేడు, రేపు ఆర్టీసీ బస్సు పాసుల జారీ నిలిపివేత

ఆత్మకూరురూరల్: ఆర్టీసీ సంస్థలో సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తున్న కారణంగా ఈనెల 5, 6 తేదీల్లో అన్ని రకాల బస్సు పాసుల జారీని నిలిపివేస్తున్నామని ఆత్మకూరు డిపో మేనేజరు కరీమున్నీసా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7వ తేదీ నుంచి కౌంటర్లలో పాసులు జారీ చేస్తామన్నారు. ప్రయాణికులు, విద్యార్థులు సహకరించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

జలదంకి: మండల కేంద్రమైన జలదంకి చిప్పలేరు నుంచి ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై లతీఫున్నీసా శుక్రవారం తెలిపారు. ముందస్తు సమాచారంతో దాడులు నిర్వహించి ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా తరగతుల నిర్వహణ

- అడ్డుకున్న విద్యార్థి సంఘాలు

ఆత్మకూరు: ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించిన నేపథ్యంలో పట్టణంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు తరగతులు నిర్వహిస్తుండడంతో ఆంధ్ర విద్యార్థి సంఘం నాయకులు అడ్డుకున్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో తరగతులు నిర్వహిస్తుండగా ఆ సంఘం కార్యవర్గ సభ్యులు మహంత్‌రెడ్డి, శ్రీరామ్‌రెడ్డి తదితరులు పాఠశాలకు చేరుకుని తరగతులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖాధికారులకు ఫోన్ ద్వారా సమాచారం తెలిపారు. అధికారులు మౌనం వహించడం సరికాదని, పరిస్థితి ఇలానే ఉంటే వారి కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఎస్ కార్యవర్గ సభ్యులు అరుణ్, పూర్ణేష్, మనోజ్, తిరుమల పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

కొండాపురం: మండలంలోని సాయిపేట గ్రామంలో శుక్రవారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పర్యటించారు. ప్రజాదర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోటేశ్వరరావు, ఎంపీడీఓ బ్రహ్మయ్య, నాయకులు మహేష్, మావిళ్లపల్లి ఓంకార్, ఓరుగంటి సుమన్, కుంకు రాజా, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిందితుల అరెస్ట్

కావలి: కావలి వద్ద రూ.1.50 లక్షల విలువ చేసే తారు డబ్బాల చోరీ చేసిన నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ జి.రాజేశ్వరరావు తెలిపారు. వారిని జైలుకు పంపినట్లు వెల్లడించారు.

వంటశాల నిర్మాణానికి ఆర్థిక సాయం

సోమశిల: అనంతసాగరం మండల కేంద్రంలోని టీజేఎస్ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంటశాల నిర్మాణానికి బట్రెడ్డి రమణారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కాంట్రాక్టర్ వెంకటకృష్ణారెడ్డి రూ.లక్ష విరాళం ప్రకటించారు. హెచ్ఎం లక్ష్మీప్రసన్నకు శుక్రవారం మొదటి విడత నగదు అందజేశారు.

సొత్తు దొరికేనా?



సంగంలో చోరీ జరిగిన ఇంటి వద్ద విచారణ చేస్తున్న సీఐ, ఎస్సైలు (ఫైల్)

రోజూ ఏదో ఒకచోట చోరీలు జరుగుతూనే ఉన్నాయి. కష్టపడి పనిచేసి కూడబెట్టిన డబ్బు, ఇంకా బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లిపోతున్నారు. బాధితులు విషయాన్ని పోలీసులకు తెలియజేయడం, వారు సిబ్బందితో కలిసి హడావుడి చేసి ఘటనా స్థలాన్ని పరిశీలించడం, క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ రావడం.. ఒకటి, రెండు రోజులు దర్యాప్తు చేయడంతో కథ ముగుస్తోంది. ఆ తర్వాత పురోగతి కనిపించడం లేదు. సొత్తు తిరిగి వస్తుందో.. రాదోనన్న ఆందోళనలో బాధితులు ఉండిపోతున్నారు.

- పెరిగిన దొంగతనాలు.. రికవరీలు నిల్
- పోలీస్ అధికారులు, సిబ్బంది బదిలీలతో నత్తనడకన దర్యాప్తు
- బంగారం, డబ్బు కోసం ఎదురుచూస్తున్న బాధితులు

ఆత్మకూరు: ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో స్థానిక మున్సిపాలిటీతోపాటు సంగం, ఏఎస్‌పేట, మర్రిపాడు, చేజర్ల, అనంతసాగరం, ఆత్మకూరు మండలాలున్నాయి. గడిచిన ఆరు నెలల వ్యవధిలో అనేక గ్రామాల్లో దొంగతనాలు జరిగాయి. సంగం, ఏఎస్‌పేట, అనంతసాగరం మండలాల్లో కేవలం ఆలయాలే లక్ష్యంగా వరుసగా చోరీలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఆ సమయంలో పోలీసులు ఎంతో హడావుడి చేశారు. ఇటీవల పోలీస్ శాఖలో బదిలీలు జరిగాయి. కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు అధికారులు, సిబ్బంది బదిలీ అయ్యారు. దీంతో చోరీ కేసుల్లో దర్యాప్తునకు అంతరాయం ఏర్పడినట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

కొలిక్కి రాలేదు

ఇటీవల అనంతసాగరం మండలంలో మూడు చిన్న ఆలయాల్లో జరిగిన చోరీకి సంబంధించిన సొత్తు రూ.2 వేలను మాత్రమే పోలీసులు రికవరీ చేశారు. మొత్తంగా 50 శాతం రికవరీ చేశామని చెబుతున్నారు. అయితే మిగిలిన మండలాల్లోని ఆలయాల్లో చోరీలు, మున్సిపల్ పరిధిలో జరిగిన రెండు పెద్ద దొంగతనాల కేసుల్లో పురోగతి లేదు. మున్సిపల్ పరిధిలోని జేఆర్‌పేటలో ఓ కుటుంబం నెల్లూరులోని ఆస్పత్రికి వెళ్లడంతో వారింట్లో చోరీ జరిగింది. 16 సవర్ల బంగారంతోపాటు రూ.5 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఇది జరిగిన రెండు రోజుల అనంతరం ఆ ఇంటికి సమీపంలోనే మరో ఇంట్లో దొంగతనం జరిగింది. రూ.30 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఈ రెండు ఘటనలు ఒకే రాత్రి జరిగి ఉండొచ్చని అప్పట్లో పోలీసులు పేర్కొన్నారు. దొంగ ఒకరేనని, త్వరలోనే పట్టుకుంటామని వెల్లడించారు. అయితే ఇప్పటి వరకు ఆ కేసులు కొలిక్కి రాలేదు. ఇలా సబ్ డివిజన్ పరిధిలో ఎన్నో చోరీ కేసుల్లో రికవరీ లేదు.

కొన్ని ఘటనలు

- జూలై నెలలో సంగం మండలంలో రెండు గృహాల్లో రూ.80 వేల నగదుతోపాటు రెండు సవర్ల బంగారాన్ని దొంగలు చోరీ చేశారు. అదే ప్రాంతాల్లో మరో నాలుగు గృహాల్లో చోరీకి విఫలయత్నం చేశారు.
- అదే నెలలో సోమశిల ప్రాజెక్ట్ హిల్ కాలనీలో ఓ చేపల దుకాణం పైన రేకులకు కన్నం వేసి రూ.25 వేల నగదును దోచుకెళ్లారు. ఆ ప్రాంతంలోని ప్రాజెక్ట్ కాలనీలోని ఓ ఇంట్లో బీరువాను పగులగొట్టినట్లు స్థానికులు తెలిపారు.
- ఆగస్ట్ మొదటి వారంలో ఆత్మకూరు పట్టణం జేఆర్‌పేటలో భారీగా నగదు, నగలు దొంగల పాలైంది.
- సెప్టెంబర్‌లో ఏఎస్‌పేటలో ఓ వృద్ధురాలి ఇంట్లో రూ.లక్ష నగదును దొంగలు ఎత్తుకెళ్లారు.
- బాధితులు నగదు, నగలు కోల్పోయి రికవరీ ఎప్పుడవుతుందా అని ఆశగా ఎదురు చూస్తున్నారు.



ఆత్మకూరు జేఆర్‌పేటలో చోరీకి గురైన ఇంటిని పరిశీలిస్తున్న పోలీస్ (ఫైల్)

ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం



నెలరోజుల వ్యవధిలో పోలీస్ అధికారులు, సిబ్బంది బదిలీ కావడంతో రికవరీల్లో కొంత జాప్యం చోటుచేసుకుంది. ఇప్పుడు సబ్ డివిజన్ పరిధిలో అన్ని పోలీస్ స్టేషన్‌లో స్టేషన్ ఆఫీసర్లు, సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ఓ వైపు దొంగతనాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటూనే గతంలో జరిగిన చోరీల్లో రికవరీలకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. త్వరలోనే నిందితులను పట్టుకుంటాం. – కె.వేణుగోపాల్, డీఎస్పీ, ఆత్మకూరు

ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలి



ఆత్మకూరులో భవన నిర్మాణ కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరురూరల్: కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని తక్షణమే అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆ పార్టీ పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ఎంజీఆర్ బస్‌స్టేషన్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. నేతలు మాట్లాడుతూ కొత్తగా ప్రకటించిన పాలసీతో గృహ నిర్మాణదారులకు ఇసుక అందకపోవడం దారుణమన్నారు. భవన నిర్మాణాలు నిలిచిపోవడంతో కార్మికుల కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల హామీ మేరకు ఉచితంగా ఇసుకను అందించాలని డిమాండ్ చేశారు. ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఇన్‌చార్జి ఆర్డీఓ ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లక్ష్మీపతి, సందానీ, నాగేంద్ర, నాగయ్య, యస్దానీ బాషా, ఆటో యూనియన్ నేత దశయ్య తదితరులు పాల్గొన్నారు.

- సోమశిల: ఇసుకను ఉచితంగా అందజేయాలంటూ అనంతసాగరం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం సీపీఎం, సీఐటీయూ, భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. సీపీఎం మండల కార్యదర్శి అన్వర్‌బాషా మాట్లాడుతూ మండలంలో గృహ నిర్మాణాల కోసం ఇసుక తోలుకునేందుకు అనుమతులు ఇవ్వడం లేదన్నారు. పలుకుబడి ఉన్న వారికే ఇసుక దొరుకుతోందన్నారు. అనంతరం తహసీల్దార్ వీర వసంతరావుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు కె.జక్రయ్య, మీరామొహిద్దీన్, నాగులూరు వెంకటేష్, బెజవాడ రహంతుల్లా, మండల షబ్బీర్, అస్లాం, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.



సోమశిల: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఈదురుగాలులతో కూడిన వర్షం



రామాలయంలో నేలకొరిగిన ధ్వజ స్తంభం

జలదంకి: మండలంలో గురువారం అర్ధరాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో చింతలపాళెంలోని రామాలయం ఆవరణలోని ధ్వజ స్తంభం నేలకొరిగింది. అలాగే విద్యుత్ స్తంభం మోటార్‌బైక్‌పై పడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి



నగదు బహుమతి అందజేస్తున్న అధికారులు

ఉదయగిరి: రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగిందని, వాటి నివారణకు సిబ్బంది కృషి చేయాలని నెల్లూరు జోన్ – 3 ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు అన్నారు. ఉదయగిరి ఆర్టీసీ డిపోను ఆయన శుక్రవారం పరిశీలించారు. వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన సిబ్బందికి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. డిపో ఆవరణలో మొక్కలు నాటారు. కార్య క్రమంలో ఆర్ఎం మురళీబాబు, డిపో మేనేజర్ శ్రీనివాసరావు, అధికారులు నాగభూషణం, నాగరత్నం, నారాయణారావు, ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మోటార్‌బైక్‌పై వెళ్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సీతారామపురం: స్థానిక ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో శుక్రవారం మోటార్‌బైక్ అదుపుతప్పి తెల్లాకుల నాగరాజు అనే వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికుల కథనం మేరకు.. వైఎస్సార్ జిల్లా మైదుకూరుకు చెందిన నాగరాజు బైక్‌పై సీతారామపురం నుంచి ప్రకాశం జిల్లా కొత్తపల్లికి బైక్‌పై బయలుదేరాడు. దారిలో పెట్రోలు బంకు వద్దకు వచ్చేసరికి బైక్ అదుపుతప్పి బోల్తా పడ్డాడు. నాగరాజు ముఖంపై గాయాలయ్యాయి. అతను మద్యం మత్తులో ఉన్నట్లు చెబుతున్నారు.

జగజ్జననీ.. కరుణించు

ఆత్మకూరు, ఉదయగిరి, కావలి నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాల్లో రెండోరోజు శుక్రవారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలు జరిగాయి. సంగం తిరుమనకొండ రాజరాజేశ్వరీదేవి ఆలయంలో లలితా రుద్ర మహాయజ్ఞం జరిగింది.
– సాక్షి నెట్‌వర్క్



ఆత్మకూరు: జ్వాలాముఖి ఆలయంలో బాలా త్రిపుర సుందరి అలంకారంలో అమ్మవారు



వరికుంటపాడు: బాలా త్రిపుర సుందరీదేవిగా నాగారప్పమ్మ



కలిగిరి: తెల్లపాడులో గాయత్రీ దేవిగా భద్రకాళి అమ్మవారు



చేజర్ల: బోడిపాడులో ధాన్యలక్ష్మిగా..



సంగం: గాయత్రిదేవి అలంకారంలో కామాక్షితాయి



సోమశిల: గాయత్రిదేవి అలంకారంలో దుర్గమ్మ



సీతారామపురం: బాలా త్రిపురసుందరి అలంకరణలో ఇష్టకామేశ్వరీదేవి



ఆత్మకూరు: శివాలయంలో అన్నపూర్ణ అలంకారం



ఆత్మకూరు: కన్యకాపరమేశ్వరి ఆలయంలో అన్నపూర్ణ అలంకారంలో..

బాధ్యతలు స్వీకరించిన అధికారులు



ఉదయగిరి: శివకుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం



అల్లూరు: ఎంపీడీఓతో సిబ్బంది

కావలి: కావలి ఆర్డీఓగా ఎస్.వంశీకృష్ణ శుక్రవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే డివిజన్‌లోని తహసీల్దార్లు, రెవెన్యూ శాఖ సిబ్బంది నూతన ఆర్డీఓను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

- వరికుంటపాడు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ సహాయకుడిగా కొల్లు వెంకటాద్రి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన వెంకటగిరిలో పనిచేస్తూ ఇక్కడికి వచ్చారు.
- కలిగిరి: మండల ఎంపీడీఓగా కె.ప్రత్యూష శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆమెకు స్థానిక అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.
- వింజమూరు(ఉదయగిరి): వింజమూరు పంచాయతీ ఈఓగా శివకుమార్ శుక్రవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను సచివాలయ పంచాయతీ కార్యదర్శులు గడ్డం నరేంద్ర, మేడగం సందీప్‌కుమార్‌రెడ్డి, నాగిరెడ్డి, రమాదేవి తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.
- అల్లూరు: మండల ఎంపీడీఓగా రజినీకాంత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.
- ఉదయగిరి: ఉదయగిరి అటవీ రేంజ్ అధికారిగా బీఎస్ కుమార రాజా శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గిద్దలూరు టైగర్ జోన్ రేంజర్‌గా పనిచేస్తూ ఇక్కడికి వచ్చారు. అదే విధంగా తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా ఫాజియా, ఆర్ఐగా సురేంద్రలు బాధ్యతలు చేపట్టారు.
- జలదంకి: మండల నూతన ఎంపీడీఓగా ఎం.బ్రహ్మయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అయన కొండాపురం నుంచి బదిలీపై వచ్చారు.



వంశీకృష్ణ



షాలెట్



కుమార రాజా



బ్రహ్మయ్య



భాస్కర్



ప్రత్యూష



వెంకటాద్రి

- సంగం: మండల ఎంపీడీఓగా కె.షాలెట్ స్థానిక కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె చిట్టమూరు నుంచి బదిలీపై వచ్చారు.
- సీతారామపురం: మండల ఎంపీడీఓగా మారుబోయిన భాస్కర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

ముగిసిన కబడ్డీ శిక్షణ



కావలి: కబడ్డీ అండర్–19 జిల్లా బాలికలు జట్టుకు కావలిలోని డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఐదురోజులుగా ఇస్తున్న శిక్షణ శుక్రవారంతో ముగిసింది. శ్రీకాకుళం జిల్లా కేశవరావుపేటలో ఈనెల 6, 7, 8 తేదీల్లో జరిగే పోటీల్లో ఆ జట్టు పాల్గొంటుంది. బాలికలకు కళాశాల సెక్రటరీ దామిశెట్టి సురేష్‌బాబు, కరెస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు, ప్రిన్సిపల్ డాక్టర్ టీవీ రావు వసతి, భోజనం సమకూర్చినట్లు స్కూల్ గేమ్స్ అండర్–19 సెక్రటరీ డి.శ్రీరేష్ తెలిపారు. డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ తరఫున కోచ్ కె.కోటయ్య, దామోదర్‌రెడ్డి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ దాసరి శివసాగర్ కుమార్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

జలదంకి: కావలి ఆర్డీఓ వంశీకృష్ణ శుక్రవారం జలదంకి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు భద్రపరిచే గదిని పరిశీలించారు. పలు విషయాలపై డీటీ జూలీభాయ్‌తో మాట్లాడారు.

8న మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం

చేజర్ల: ఈనెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు మండల ప్రజా పరిషత్ 14వ సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతుందని మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలలిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగే ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొనాలని కోరారు. ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం



మాట్లాడుతున్న పోలీసులు

కలిగిరి: మండలంలోని కలిగిరి – కొండాపురం మార్గంలో తెల్లపాడు క్రాస్‌రోడ్డు వద్ద కూల్‌డ్రింక్ షాపులో నిల్వ ఉంచిన 14 మద్యం బాటిళ్లను ఎస్సై ఉమాశంకర్ గురువారం రాత్రి పట్టుకున్నారు. ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం, నాటుసారా అమ్మకాలు జరుపుతున్నా, పేకాట, కోడిపందేలు వంటి జూదాలు నిర్వహిస్తున్నా 94407 00098 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

- కావలి: పట్టణంలోని సినిమా హాలు రోడ్డులో ఉన్న బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద జంపాని వెంకటేశ్వర్లు అనే వ్యక్తి 50 మద్యం బాటిళ్లు కలిగి ఉండగా శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు.

పోలీసయ్యా.. ఇదేం పనయ్యా..



కారును తరలిస్తున్న జేసీబీ

వింజమూరు(ఉదయగిరి): రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కారు తరలింపు విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై విమర్శలు వచ్చాయి. మండలంలోని బొమ్మరాజు చెరువు గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మరణించాడు. దెబ్బతిన్న కారును పోలీసులు జేసీబీతో తరలించడంపై మృతుడి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫొటోలు సోషల్ మీడియా వైరల్‌గా మారాయి.

ఉద్యోగులకు సన్మానం



జలదంకిలో..



ఉదయగిరిలో..

జలదంకి: జలదంకి డిప్యూటీ తహసీల్దార్ సుదీర్ఘ కాలం పనిచేసిన భరత్ బోగోలుకు బదిలీ అయ్యారు. ఈయన శుక్రవారం రిలీవ్ కావడంతో కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు ఘనంగా సన్మానించారు. బోగోలులో డీటీగా పనిచేస్తున్న జూలీభాయ్, రీ సర్వే డీటీగా శ్యాంసన్ బాధ్యతలు స్వీకరించారు.

- ఉదయగిరి: మండలంలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉద్యోగులు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం స్థానిక సిబ్బంది, ప్రజాప్రతినిధులు వారిని సన్మానించారు. బదిలీ అయిన వారిలో ఈఓపీఆర్డీ మల్లికార్జున, సీనియర్ అసిస్టెంట్ గోపీ, పంచాయతీ కార్యదర్శులు అమర్నాథ్‌రెడ్డి, శిల్ప తదితరులున్నారు.